క్లుప్తంగా

మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ


ఎంపికైన గౌరీశంకర్

పుంగనూరు: అడవి నాథునికుంట మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న గౌరీశంకర్‌కు అథ్లెటిక్స్ అండర్–14 పరుగుపందెంలో ప్రథమస్థానం లభించినట్లు హెచ్‌ఎం రమ తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ గౌరీశంకర్ స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన జిల్లా పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పీఈటీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గౌరీశంకర్‌ను అభినందించారు.

తిరుమలకు పాదయాత్రగా గుండుగల్లు భక్తులు


పాదయాత్రకు సిద్ధమైన భక్తులు

గంగవరం: తిరుమల శ్రీవారి దర్శనార్థమై గుండుగల్లు గ్రామానికి చెందిన భక్తులు 200మంది సర్పంచ్ రమణ ఆధ్వర్యంలో శనివారం పాదయాత్రగా వెళ్లారు. గోవింద మాలధారణ ధరించి స్థానిక కోదండరాముని ఆలయంలో పూజల అనంతరం తిరుమలకు పాదయాత్ర ప్రారంభించారు. ఏళ్లతరబడి తిరుమలకు పాదయాత్రగా వెళ్లడం ఆనవాయితీగా వస్తోందని, అటవీ మార్గం నుంచి కాలినడకన శ్రీవారి మెట్ల మార్గం మీదుగా సోమవారానికి తిరుమలకు చేరుకుంటామని భక్తులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామకుప్పం: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 13, 14 తేదీల్లో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మండలంలోని విజలాపురం, సింగసముద్రం, పంద్యాల మడుగు, గౌరివిమాకులపల్లి, రామకుప్పం సచివాలయ పరిధిలో ఒక్కొక్క వలంటీర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

లైసెన్స్ తప్పనిసరి


సమావేశంలో తహసీల్దార్ మురళి

రామకుప్పం: బాణసంచా విక్రయాలకు దుకాణాదారులు లైసెన్స్ తప్పనిసరిగా కలిగిఉండాలని తహసీల్దార్ మురళి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బాణసంచా దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెప్యూటీ తహసీల్దార్ దిలీప్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ పాల్గొన్నారు.

నేడు కుప్పంలో జాబ్‌మేళా

కుప్పం: సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సాహి ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకుడు జగదీష్‌బాబు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి, డిగ్రీ పూర్తయిన అభ్యర్థులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకుని జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9391833999 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి ఎంపిక


కుమారస్వామిరెడ్డి

పలమనేరు: పలమనేరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా కుమారస్వామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు ఆసంఘ గౌరవాధ్యక్షుడు ఆర్.మాధవ్ శనివారం తెలిపారు. కుమారస్వామిరెడ్డి మూడు దశాబ్దాలుగా సాహిత్యరంగంలో సేవలందిస్తున్నారు. ఆయన కవిగా, రచయితగా అనువాదకులుగా మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన ఎంపికపై జిల్లాలోని కవులు, రచయితలు, సాహిత్య సంఘాల సభ్యులు అభినందనలు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పుంగనూరు: మండలంలోని నెక్కుంది చెరువులో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.19,400 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాఘవరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో పట్టణంలోని కోనేటి పాళేని చెందిన వెంకటాచలపతి, చౌడేపల్లె మండలం ఎ.కొత్తకోట గ్రామానికి చెందిన షేక్ అజ్మతుల్లా, పుంగనూరు మండలం బండ్లపల్లెకి చెందిన శ్రీనివాసులురెడ్డిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.19,400 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

మీకు అండగా మేముంటాం!

- స్థానికులకు ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు భరోసా


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


గజమాలతో ఎమ్మెల్యేని సత్కరిస్తున్న ప్రజలు

వి.కోట: నిరంతరం ప్రజాసేవకే అంకితమై మీకు అండగా మేముంటామంటూ ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రజలకు భరోసానిచ్చారు. శనివారం మండలంలోని చింతమాకులపల్లి పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు నిర్వహించారు. కుదవగడ్డ గ్రామం, కోనేరు గొల్లపల్లి, చింతమాకులపల్లి, కాంచిమిట్టపల్లి, పసలమంద గ్రామాల్లో గడప గడపకు నిర్వహించారు. ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు. స్థానికులు వారి దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు అధికారులను ఆదేశించారు. స్పందించిన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ వెంటనే సంబంధిత అధికారులకు సమస్యలను పరిష్కరించేలా ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవని ఆ ఘనత జగనన్నకే చెందుతుందన్నారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రజాసేవలకే అంకితమైనట్లు తెలిపారు. గతంలో మండలంలోని వి.కోట–పేర్నాంబట్ హైవే ఏడుచుట్లకోట నుంచి పసలమంద, కాంచిమిట్లపల్లి మీదుగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆగ్రామాల ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని వారు ప్రజలను కోరారు. ఎంపీపీ యువరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, ఎస్‌ఏ గౌస్, మండల కన్వీనర్ బాలగురునాథ్, వైస్ ఎంపీపీ తమీమ్, లక్ష్మణ్, మండల సచివాలయ కన్వీనర్ కిషోర్, మండల మహిళాధ్యక్షురాలు శశికళ, సర్పంచ్ రామచంద్రప్ప, రెస్కో డైరెక్టర్ భూపతి, నేతలు ప్రతాప్‌రెడ్డి, కృష్ణమూర్తి, ఎన్‌వీజీ యువత, ఏఎంసీ డైరెక్టర్లు మణి, వేణు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బూత్ కమిటీలే కీలకం


డప్పు కళాకారులకు అందజేస్తున్న ఐడీ కార్డులు

సోమల: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బూత్ కమిటీలే కీలక బాధ్యత వహించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్యనేతలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో గత ప్రభుత్వాల్లో ఎన్నడూ జరగని అభివృద్ధి పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతున్నాయన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేశామని, వాటిని ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేసి, గత టీడీపీ పాలనకు, జగనన్న పాలన తేడాను వివరించాలన్నారు. బూత్ కమిటీ సభ్యులు పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషిచేయాలని సూచించారు. అనంతరం డప్పు కళాకారులు రెడ్డెప్ప, శ్రీనివాసులుకు ఐడీ కార్డులను అందజేశారు. ఈనెల 9 నుంచి 28 వరకు జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ బూత్ కమిటీ ఇన్‌చార్జ్ రవితేజారెడ్డి, ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్ బాషా, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు నాగభూషణంరెడ్డి, నేతలు అమాస మోహన్, నాగేశ్వరరావు, సాంబయ్య, మొగిళ్లగారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

- బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా అందజేత


బీమా నగదు అందజేస్తున్న నేతలు

గంగవరం: మండలంలోని మల్లేరు గ్రామానికి చెందిన పూల వ్యాపారి బాలక్రిష్ణ(52) శనివారం గుండె జబ్బుతో మృతిచెందాడు. ఇతనికి గుండె నొప్పి రావడంతో కుటుంబసభ్యులు వెంటనే పలమనేరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్టు కుటుంబీకులు తెలిపారు. మృతుడికి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10వేల నగదును నేతలు ప్రహ్లాద, వేణురెడ్డి, గోపిక్రిష్ణ, సచివాలయ సిబ్బందితో కలిసి మృతుడి కుటుంబీకులకు అందజేశారు.

నిబంధనలు తప్పక పాటించాలి



సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

గంగవరం: రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాలను అరికట్టేందుకు వాహనదారులు సహకరించాలని ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం పలమనేరు– బెంగళూరు జాతీయ రహదారిలో హోటళ్లు, దాబాల వద్ద అక్కడక్కడ ప్రమాద సూచిక బోర్డులను పోలీసులు ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ రహదారుల్లో రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రతా నిబంధనలకు సంబంధించిన సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రహదారి నిబంధనలపై అవగాహన పెంచుకుని ప్రతి ఒక్కరిలో మార్పు రావాలని కోరారు.

ఓటర్ల నమోదు పకడ్బందీగా చేపట్టాలి

– సీఈఓ ప్రభాకర్‌రెడ్డి


ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న సీఈఓ

పుంగనూరు: ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు పకడ్బందీగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన పట్టణంలోని కొత్తయిండ్లు హైస్కూల్‌లో జరుగుతున్న నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. సీఈఓ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ఓటర్ల జాబితాలతో ప్రారంభమౌతుందన్నారు. ఇలాంటి విషయంలో ఎవరూ అలసత్వం వహించరాదన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతను గుర్తించి, వారి ఇంటికి వెళ్లి ఓటరుగా నమోదు చేయించాలన్నారు. అధికారులు, బీఎల్‌ఓలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీతారామన్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎకరాకు మూడు బస్తాలు


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఎస్‌ఓ

రొంపిచెర్ల: ఎకరాకు మూడు బస్తాల వేరుశనగ దిగుబడి వచ్చిందని ఏఎస్‌ఓ రాజేశ్వరి అన్నారు. ఆమె శనివారం చెంచెంరెడ్డిగారిపల్లెలో పంట కోత ప్రయోగం చేశారు. రైతు రామచంద్రారెడ్డి పొలంలో 5 మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పు విస్తీర్ణంలో 2.20 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. ఆ మేరకు ఎకరాకు మూడు బస్తాలు మాత్రమే వస్తాయని తెలిపారు. రైతు మాట్లాడుతూ వేరుశనగ పంటకు కూలీలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.. ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు కురవపోవడంతో పంట దెబ్బతిందని తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్బీకే ఇన్‌చార్జి సుజాతమ్మ పాల్గొన్నారు.

అందుబాటులో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా


చౌడేపల్లె: ఓటు నమోదు కేంద్రంలో జెడ్పీ సీఈఓ

చౌడేపల్లె: పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను పెట్టామని నియోజకవర్గ ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఓటర్ల జాబితాతోపాటు, ఓటు హక్కుపై ఎలాంటి సందేహాలు ఉన్నా అక్కడికెళ్లి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. శనివారం చౌడేపల్లె ఉన్నతపాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల వద్ద స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా సీఈఓ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు జాబితా సిద్ధంగా ఉందని, రాజకీయ పార్టీల నేతలకు చెందిన బీఎల్‌ఏలు, బీఎల్‌ఓలు అక్కడే ఉంటారన్నారు. నేరుగా ప్రజలు అక్కడికి వెళ్లి వారి సమస్యలను తెలియజేయడంతోపాటు ఓటరు జాబితాను పరిశీలించవచ్చునన్నారు. ఆయన 101,107 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎంపీడీఓ సుధాకర్, తహసీల్దార్ మాధవరాజు, ఎంపీపీ రామమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంజిబాబు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

సదుం: రెండు రోజుల పాటు ఓటరు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ చంద్రశేఖర్ శనివారం తనిఖీ చేశారు. బూరగమందలో 188, 189, 190, సదుంలో 180 నుంచి 184 వరకు ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఓటరు నమోదు, సవరణ, మార్పులు, చేర్పులకు 4, 5 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమానికి పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని ఆయన చెప్పారు. స్థానిక ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

సోమల: మండలంలోని పలు పోలింగ్‌బూత్‌లను తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, సవరణల కోసం రెండు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఉన్న బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. రీసర్వే డీటీ రామ్మూర్తి, వీఆర్వో అమాస సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రామకుప్పం: మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ మురళి పరిశీలించారు. అనంతరం 49 పోలింగ్ కేంద్రాల బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్‌లు, బీఎల్‌ఏలతో ప్రత్యేక ఓటర్ల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలోని రెవెన్యూ సిబ్బంది ఓటర్ల జాబితాను పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ దిలీప్ పాల్గొన్నారు.


కుప్పంలో ఓటరు నమోదు

కుప్పం: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు మోడ్రన్ కాలనీలో శనివారం రెవెన్యూ సిబ్బంది ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని వారు తెలిపారు. దీంతోపాటు మార్పులు, చేర్పులు ఉంటే సరిచేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని ఈసందర్భంగా స్థానిక కౌన్సిలర్ హఫీజ్ కోరారు.


బూరగమంద పోలింగ్ కేంద్రంలో తహసీల్దార్



నెల్లిమంద పోలింగ్ బూత్‌లో తహసీల్దార్, రామకుప్పం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

డిసెంబర్ 9న జాతీయ లోక్‌అదాలత్


మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు, చిత్రంలో జడ్జిలు కార్తీక్, సింధు

పుంగనూరు: డిసెంబర్ 9న పుంగనూరు కోర్టు ఆవరణలో జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు కోరారు. శనివారం సాయంత్రం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సింధుతో కలిసి పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వాసుదేవరావు మాట్లాడుతూ న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులను పరిష్కరించే దిశగా లోక్‌అదాలత్‌లను న్యాయవాదులు, ప్రజలు వేదిక చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరిస్తామన్నారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఇరు పార్టీలను పిలిపించి, రాజీమార్గంలో కేసులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం సీఐలు రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్‌ఈబీ సీఐ సీతారామిరెడ్డి, ఎస్‌ఐలు రవికుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను జెడ్పీ సీఈఓ పి.ప్రభాకర్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికతో పాటు పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యా బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను పలు సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాల ఆవరణలోని వంట గది, టాయిలెట్స్‌ను ఆయన పరిశీలించారు. అసంపూర్ణంగా ఉన్న నాడు–నేడు పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ అబ్దుల్ రహీం, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బాలచందర్, మురళి పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు కృషి


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ తాజ్‌మస్రూర్

గుడుపల్లె: విద్యార్థుల భవిష్యత్తుకు కృషిచేయాలని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ పేర్కొన్నారు. శనివారం మోడల్ స్కూల్‌లో సచివాలయంలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులకు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సచివాలయ ఉద్యోగులు శాఖల వారిగా నెలకు ఒక పాఠశాలను సందర్శించాలన్నారు. డ్రాప్ అవుట్ లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ గుర్రప్ప, ఎంఈఓ శ్రీదేవి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


బిజగానిపల్లెలో తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

ఉపాధి పనుల తనిఖీ

గుడుపల్లె: ఉపాధి పనులను ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ తనిఖీ చేశారు. శనివారం గుడుపల్లె, బిజిగానిపల్లెలో జరుగుతన్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. మస్టర్లను పరిశీలించి పనుల వివరాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. చేస్తున్న పనులకు సకాలంలో బిల్లులు పెట్టాలని టెక్నికల్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో టీఏ సోమశేఖర్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


పనులు పరిశీలిస్తున్న అమరనాథ్

వి.కోట: గ్రామాలు రాష్ట్రానికి పట్టుగొమ్మలాంటివని అందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా చేపడుతున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ, సామాజికసేవ సలహాదారుడు అమరనాథ్ అన్నారు. శనివారం మండలంలోని నక్కనపల్లిలో జెడ్పీ నిధులతో నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్లను ఆయన పరిశీలించారు.

హోరాహోరీగా ముగిసిన వాలీబాల్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం నాగమల్లిక

చౌడేపల్లె: మేకలచిన్నేపల్లె ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పుంగనూరు జోన్ వాలీబాల్ క్రీడాపోటీలు శనివారం హోరాహోరీగా ఉత్కంఠ భరితంగా ముగిశాయి. జోన్ పరిధిలోని ఏడు మండలాల నుంచి 35 జట్లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో విన్నర్స్‌గా మర్రిమాకులపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల జట్టు, రన్నర్స్‌గా కాటపేరి ఉన్నత పాఠశాల జట్టు విజేతగా నిలించాయి. సీనియర్ బాలుర విభాగంలో విన్నర్స్‌గా విజయవాణి ఇంగ్లిషు మీడియం స్కూల్ జట్టు, రన్నర్స్‌గా కందూరు హైస్కూల్ విద్యార్థులు గెలుపొందారు. జూనియర్ బాలుర విభాగంలో విన్నర్స్‌గా జెడ్పీ హైస్కూల్ ముత్తుకూరు జట్టు, రన్నర్స్‌గా జెడ్పీ హైస్కూల్ చౌడేపల్లె జట్టు విజేతలుగా నిలిచాయి. గెలుపొందిన జట్లకు హెచ్‌ఎం నాగమల్లిక, ఎస్టీయూ మండల అధ్యక్షుడు లింగమూర్తి, జోనల్ క్రీడల కార్యదర్శి రామచంద్ర బహుమతులను అందజేశారు.

పలమనేరుకు ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర



మాట్లాడుతున్న సీపీఎం నేత గఫూర్

పలమనేరు: రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బీజేపీ పాలకుల తీరుకు నిరసనగా సీపీఎం చేపట్టిన ప్రజారక్షణభేరి బస్సు యాత్ర శనివారం పలమనేరు పట్టణానికి చేరుకుంది. స్థానిక సీపీఎం నాయకులు, ప్రజాసంఘాలు గంగవరం నుంచి బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. ఆర్టీసీ బస్టాండు వద్ద జరిగిన సమావేశంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కరయ్య ఈ సందర్భంగా ప్రసంగించారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తామన్న బీజేపీ మోసం చేసిందన్నారు. రాజధాని అమరావతి కట్టడంతోపాటు రాష్ట్ర నలుమూలల సమాన అభివృద్ధి చెందాలని సీపీఎంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తాము సూచించామని, అమరావతి ధ్యేయంగా పనిచేయడంతో చంద్రబాబును ఓడించారని గఫూర్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగానే బస్సుయాత్ర చేస్తున్నట్టు తెలిపారు. నేతలు వాడ గంగరాజు, ఓబుల్ రాజు, భువనేశ్వరి, గిరిధర్‌గుప్త పాల్గొన్నారు.